# ఎర

ఆరోజు పట్టణంలో గోవధనిషేదం గూర్చిన ఊరేగింపు బయలుదేరింది. జనం అరటిపండ్లను కొని ఆవులకు, దూడలకు వేస్తువున్నారు. సరిగ్గా అప్పుడే ఓ స్త్రీ పండ్లవాడికి రూపాయిచ్చి పండ్లు ఇవ్వమంది. ఆమెను ఎగాదిగా చూసి గెలనుండి రాలిపడివున్న రెండు నల్లగా మారినపండ్లను ఇవ్వ చూశాడు. ఆమె ఒక్కసారే కోపిష్టిరాలుగా మారి తీక్షణంగా వాటివైపు, అతని వైపు చూసింది. " ఏమైంది నీవు అడుక్కుతినే వాటికన్న బాగానే వున్నాయి "అన్నాడు. సంకలోని పిల్లవాడు పండ్లవైపు చేయి చూపుతూవుంటే వారిస్తూ " పైసలిచ్చాను " అన్నది కఠినంగ పండ్లవానివైపు చూస్తు.

" చూస్తలేవు అందరు మంచి పండ్లను కొని ఆవులకు వేస్తుంటే" అన్నాడు. అదో మాదిరిగా పండ్లవాడు.

" పశువులకేమోమంచివి. మనుషులకు పాసినయా! ఏంమనుషులుర" అంటు తిట్టుడు మొదలు పెట్టింది. బండివాడు రూపాయిని తిరిగిచ్చాడు. దాంతో ఆమె మరీ రెచ్చిపోయి అక్కడున్నవారందరినీ కలిపి తిట్టసాగింది. ఆ దృశ్యాన్ని చూస్తువెళుతున్న ఇద్దరిలో రాధటీచర్, తనకన్న సీనియర్ టీచర్ సావిత్రి తో "ఆమె ఎప్పుడు ఎవరినో ఒకరిని తిడుతూనేవు ంటుంది. ఎందువల్ల?" అని అడిగింది.

" ఆమె సంగతా చెపుతా రా" అంటు ఇంటి వైపు నడుస్తు చెప్పసాగింది సావిత్రి.

" ఆమె పేరు మైనా, ఆ పేరు ఆమె తల్లి తండ్రి పెట్టింది. అడవి నుండి తేనె, కట్టెలు పల్లెలకు పట్టణానికి తెచ్చి అమ్ముకుంటు బతికే వృత్తి వాళ్లది. ఏడెనిమిదేళ్ళప్పుడు మైనాను ఓ ఫారెస్టు ఆఫీసర్ తీసుకొచ్చి బళ్ళో జైన్ చేసి ఆతరువాత ప్రభుత్వ బాలికల హాస్టల్లో చేరిపించాడు. హాస్టల్లో చదువుతు, ఆటల్లో చురుకైనదిగ, చదువులో తెలివైనదిగా పెరిగింది. వాళ్ల హాస్టల్ పక్కమ్మటె మాయిల్లు. శెలవుల్లో తమ తండా కెళ్లినప్పుడు, కాయలు, పండ్లు తింటు, జాలు నీళ్లలో జలకమాడుతూ, ఏటినీటిని తాగుతు వుండడం వల్లా దానిమ్మపండు రంగులో మారి వచ్చేది మైనా. మళ్లీ హాస్టలు తిండికి, ఉప్పునీళ్లకు ఎండు కొబ్బరి వెనుక భాగపురంగులా మారిపోయేది. అందువల్ల తన ఫ్రెండ్స్ వచ్చేటప్పుడు వనలక్ష్మి పోయేటప్పుడు భూలక్ష్మి అంటూవుండేవారు. మైనా తొమ్మిదో తరగతి పరీక్ష రాస్తునే పెద్దమనిషిఅయ్యింది.

ఆతరువాత ఇంటికెళ్లినప్పుడు తాను పెద్దమనిషి అయిన విషయం తల్లికి చెప్పింది. తల్లి తండా అందరి చెవుల్లోను వేసింది. అప్పుడే సరిగ్గా ఇంట్లోకి రాక పక్కకు నిలుచుంది.

అది గ్రహించిన తల్లి ఇడుపున కమ్మలతో ఓ చిన్న గుడిసెను వేసి అందులో కూర్చోబెట్టి పసుపు, కుంకుమ, నువ్వులు, నూకలు, కొబ్బరిబెల్లం యిచ్చింది. గుడిసెముందు మొద్దుల కుంపటిని ఆ ఐదు రోజులు వుంచింది. తండాలోని తన అన్నల తమ్ముల భార్యలు ఆమాట ఈమాట అని మోటు సరసాలు ఆడేవారు. అయినా మైనా నవ్వుతు వుండేది. నవ్వినప్పుడు ముత్యాలు మెరిసినట్టుండేవి ఆమె పలువరుస. కాటుక కండ్లు, చక్కని ముక్కు, చిన్నప్పుడే గదమ మీద నుదుట పొడిపించిన పచ్చబొట్టు. నుదుటి పచ్చను కుంకుమ బొట్టుతో కప్పేసినా గదమ మీదిది దాయలేదుకదా!

తల్లి తండ్రి సంబంధం కోసం చుట్ట పక్కాలను పలకరించసాగారు. అది తెలుసుకున్న మైనా యింకా చదవాలని అమ్మానాన్నలమీద అలిగొచ్చి పదవ తరగతి పట్టుదలతో చదివి పాసైంది. మళ్ళీ వేసవిసెలవులు వచ్చాయి. మైనా ఇంటికి వెళ్ళలేదు. ఇంటికి వెళితే ప్రమాదం. ఆ విషయం మేట్రిన్‌కు చెప్పింది మైనా. బాగా చదివే అమ్మాయి కాబట్టి మూసేముందు మిగిలిన బియ్యం, ఉప్పు, పప్పు ఇచ్చింది. అవే ఆమెకు ఆ శెలవుల్లో తిండిబత్తెం. హాస్టల్లోనే వుంటు, అప్పుడప్పుడు వంటరిగ బయటికి వెళ్లిరావడం చూసిన కొందరు జూల్ విదిలించారు. ఒకరాత్రి వాచ్‌మెన్ నిద్రపోతున్నాడు. నిద్రను నటించిన మైనా దగ్గరికి రాగానే ఒకన్ని జాడిచ్చి తన్నింది. మరొకడు వంగినప్పుడు వాని మెడను పట్టి వంగబెట్టినేలకు కొట్టింది. ఎన్నోసార్లు తల్లి-తండ్రి వచ్చిరమ్మన్నా మైనా వెళ్లలేదు. అంతేకాదు పెళ్లి గురించిన ఆలోచనలను ప్రస్తుతం మానుకొమ్మంది.

* * *

నాగార్జునసాగర్ లో ఓ ప్రముఖ రాజకీయ కార్యకర్తల శిక్షణ శిబిరం ప్రారంభమైంది. అది వారం రోజులు నడిచింది. దేశంలోని నలుమూలలనుండి నేతలందరు పాల్గొన్నారు. యువ మహిళా ప్రసిడెంట్ స్మితా పాటిల్ ఆ తరగతులకు హాజరైంది. అప్పుడు శిభిరంలోని పనులు చూసుకోవడానికి మహిళా కార్యకర్తలు కావలసి వచ్చింది. కొంత మంది యువతులను మహిళా వాలంటీర్లుగా నియమించారు. అందుల్లో మైనా ఒకతి. ఆమె విగ్రహాన్ని చురుకుతనాన్ని చూసి ప్రధానసేవక్ గా నియమించారు. అంతేకాదు స్మితాపాటిల్ అవసరాలను పర్యవేక్షించేపనులను కూడా ఆమెకే అప్పచెప్పారు. మైనా తన విధులను సక్రమంగా నిర్వహించి పది మంది నాయకుల దృష్టిని ఆకర్షించింది.

"కహా తక్ పడే" పాటిల్ అడిగింది.

"హెచ్ ఎస్సి మేడమ్" అంది మైనా.

" అవుర్ ఆగే పడ్‌నాతా"

"హమ్ గరీబ్ గిరిజన్ హై మేడమ్ అవుర్ పడ్‌నా నహీ ఓగా" అంది తనకు తెలిసిన

హిందీలో. ఆర్థిక ఇబ్బందులవల్ల చాలా మంది చదువులను ఆపేస్తు వున్నారని దీనికి ఏదైనా మార్గం వెతకాలని ఆలోచిస్తువుంది పాటిల్. ఈ లోపు జిల్లా మహిళా అధ్యక్షురాలు సరోజిని అక్కడికొచ్చింది. ఆమెకో నలభై ఏళ్లుంటాయి. నల్లరాతి శిల్పం లాంటి శరీర నిర్మాణం. ఆమెకు పెళ్లి అయ్యిందో లేదో ఎవరికి తెలియదు. మొత్తం మీద ఒంటరి బతుకు. చదువూ తక్కువే అయినా బతుకు నేర్పిన భాషలలో బాగానే మాట్లాడుతూ వుంటుంది.

"గుడ్ మార్నింగ్ మేడమ్" అంది సరోజ.

"వెరిగుడ్ మార్నింగ్, ఆయియే బైటియే" అంది ఎదుటి కుర్చీని చూపిస్తూ పాటిల్. సరోజిని కూర్చుంది.

మైనా ఆమెకు నమస్కరించగా ఆమె ప్రతి నమస్కారం చేస్తూ -

" ఏం మైనా ఎలావున్నాయి పార్టీ పనులు" అని అడిగింది. మైనా నవ్వింది.

"ఇన్ కో పార్టీమే అగర్‌లియే అచ్ఛా రహేగ" అంది పాటిల్.

"బహుత్ అచ్ఛా రహేంగే. అచ్ఛా భవిషత్ రహేంగె, యస్టి హైనా" అంది సరోజ.

"సోచో మైనా" అంటు పాటిల్ ఏదో అవసరం మీద అక్కడినుండి వెళ్లి పోయింది.

ఆరోజునుండి సరోజని గారి వెంట మైనా వుంటూ వచ్చింది. జిల్లా మహిళా రంగానికి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. పార్టీలో చురుకుగా పనిచేస్తూ వుంది.

అసెంబ్లీ ఎన్నికలొచ్చాయి. తన టికెట్ కోసం సరోజ పార్టీని వొప్పించడానికి ఢిల్లీ వెళ్లింది. టికెట్ రావడం కష్టతరం అనిపించింది. మహిళా కోటాలో తనకు తప్పక సీటు ఇవ్వాలని కూర్చుంది సరోజిని.

పార్టీ కార్యాలయంలో ఇన్‌ఫ్లుయన్స్ వున్న చాలా మందిని కలిసింది. కొందరిని ఒంటరిగా కూడ కలిసింది. మరికొందరికి మంచి పార్టీ యిచ్చింది. పార్టీలలో అలరించి ఆనందపర్చింది. మొత్తంమీద పార్టీ ప్రెసిడెంటును ఆ కొత్తమిత్రుల ద్వారా కలిసి తనకు టికెట్ ఇప్పించమని కోరింది. మళ్లీ కలుస్తాను సార్ అంది ప్రెసిడెంట్ నోరు విప్పలేదు. దరఖాస్తును చూసి పక్కకు పెట్టాడు. ఆమే నమస్కరించి నవ్వుతూ బయటికి వచ్చింది. ఆనవ్వును చూసి అందరూ అభినందనల చూపులను చూశారు. ఆమె పెదవులు ముసి ముసిగ కదిలినయి. తిరుగు ప్రయాణం రైలులో రకరకాల ఆలోచనలు. వారం రోజుల తరువాత ఆమె మళ్లీ ఢిల్లీ వెళ్లింది. ఈ సారి వెంటమైనాను కూడాతీసుకెళ్లింది. దసరా నాడు పాలపిట్టను చూసినట్టు అందరు మైనానే చూస్తువున్నారు. మైనా ఎవరిచూపులు పట్టించుకోక చరిత్ర పాఠాల్లో చదివిన అంశాల ప్రతిరూపాలు అక్కడక్కడ కనిపిస్తువుంటే వాటినే పరిశీలనగ చూస్తువుంది.

పార్టీ కార్యాలయం ముందు గుంపులు గుంపులుగ జనం వున్నారు. ఆడవాళ్లకు ప్రాతినిధ్యం సంగతేమిటి అని మహిళల వాదన. ఎవరి వాదనతో వాళ్లు, ఎవరి అనుయాయులతో వాళ్లు. పలు ప్రాంతాల వాళ్లు ఢిల్లీలో మకాం వేశారు. అభ్యర్థులను ఎన్నిక చేయడానికి త్రిమెన్ కమిటిని వేశారు. ఈ కమిటి అభ్యర్థుల దరఖాస్తులన్నింటిని పరిశీలిస్తునే వున్నారు. దరఖాస్తులు పెట్టుకున్న వాళ్లు అటు పార్టీ అధ్యక్షున్ని యిటు కమిటి సభ్యుల్ని కలుస్తువున్నారు. సరోజిని సాయంత్రం మంది పలుచబడ్డాక కమిటి సభ్యులున్న హాల్లో అడుగు పెట్టి చేతులు జోడించి, వరసగా ముగ్గిరి వైపు తిరుగుతూ నమస్కార్ అంటు నిలుచుంది, వెనకాల మైనా నమస్కరిస్తు నిలుచుంది.

వాళ్లు ప్రతి నమస్కారం చేసినట్టు తల లాడించారు.

భైటియే అన్నాడు ముగ్గిరిలో ఒకరైన గులాం అలి, మైనార్టీ ప్రతినిధి. సరోజిని కూర్చుంది. మైనా అలాగే నిలుచుంది. 'నీవుకూడా కూర్చో' అన్నట్టు సైగచేశాడు. మరో సభ్యుడు యష్‌పాల్.

'ఆ భైటో' అన్నట్టు సైగ చేసింది సరోజిని. మైనా కూర్చుంది.

సరోజిని తన గోడు మొదలు పెట్టింది. గత రెండు మూడు ఎలక్షన్స్ నుండి ప్రయత్నిస్తువున్నాను. నాకు ఈసారన్న టికెట్ తప్పక యివ్వాలి అన్నది ఎంతో వినయంగ.

"మన పార్టీలో మహిళలకు ప్రాధాన్యత యివ్వటం లేదని వేరే పార్టీ వాళ్లు బదనాం చేస్తున్నారు." అని కూడా అన్నది.

" సహి హై " అన్నాడు మిశ్రా తలాడిస్తూ మూడవ మెంబర్.

"హంబి జరా దేక్కేదేనా" అన్నాడు అలి.

"యస్.సి, యస్.టి. లోగోమే చునావట్ కర్నా" అన్నాడు యష్ పాల్.

వాళ్ల మాటలు అటు సరోజకు ఇటు మైనాకు అర్థం అవుతూనే వున్నాయి. ఆమాట అనగానే ఎందుకో మైనా మనస్సులోను ఆశమొలిచింది. 'తాను యస్టి. యేకద' అనుకుంది. అట్లా అనుకోంటు రోజు పార్టీ ఆఫీసుకు వెళ్లడం, పొద్దంత అక్కడ గడుపడం, సాయంత్రం తాముంటున్న హోటల్ గదికి రావడం యిట్లా వారం రోజులు గడిచాయి.

సరోజిని అందరితో దగ్గరి దగ్గరి నడక, రాసుకొని రాసుకొని నిలుచోవడం, జోకులు నవ్వులు చేతిలో చేయివేసి గుసగుసలు. జిల్లాల్లో సరోజిని వేరు, ఢిల్లీలో సరోజిని వేరని తోచింది మైనాకు.

ఆరో జు పొద్దున లేవగానే అద్దం ముందు కూర్చొని, అందంగ అలంకరిచుకోని వీలైనంత ఆకర్షిణీయంగా తయారయి, అందరితో ఫ్రీగా తిరుగుతువుంది. " ఏయ్ పిల్ల యిలా

వుండక తప్పదు, అయినా నలుగురినీ నవ్విస్తు నవ్వుతూ తిరిగితే తప్పేమి. మనమేమన్న వంటింట్లో వున్నామా వొదిగి వొదిగి వుండటానికి. పాలిటిక్స్‌లో వున్నాం తెలుసా" అంది పార్టీ ఆఫీసు గేటులో అడుగు పెడుతూ-

"అవును నిన్న పెద్దసార్ గూడ యస్టీ వాళ్లు కావాలి అన్నారు గదా" అందిమైనా. అవును అన్నట్టు చిరునవ్వు నవ్వుతూనే ఏదో ఆలోచనల్లోకి వెళ్లి రెప్పకొట్టకుండా మైనానే చూస్తు, చేతిలో చేయివేసి నొక్కి ఓ కన్ను మూసి తెరిచింది. వెంటనే చేయి వొదిలి పార్టీ ఆఫీసు గదిలోకి వెళ్లి ఓ దరఖాస్తు ఫాంతెచ్చి, చెట్టుకింద వున్న సిమెంట్ బెంచ్ మీద కూర్చుంటూ-

"అయితే నింపు" అంది ఫాం ఆమెకిస్తూ.

"జోకుచేస్తున్నారా మేడమ్ ఏదో నిన్న వాళ్లన్నందుకు" అంది నవ్వుతూ.

"జోకెందుకు నిజమే నేను వెళ్లి సారుతో మాట్లాడత నాకు రాకున్న నీకొచ్చిన చాలు" అంది నవ్వుతూ. ఏటు అర్థం కాక ఏమో అంటు పెన్ విప్పి ఫాంనింపింది మైనా.

"నీవిక్కడే కూర్చో వెళ్లి యిచ్చి వస్త" అంటు కమిటి కూర్చున్న గదిలోకి వెళ్లింది. మైనా ఏదేదో ఆలోచిస్తు కూర్చుంది.

"పార్టీ టికెట్ వస్తే" మనస్సు?

"వేరే పార్టీ పోటీని తట్టుకోగలమా" మైనా

"మరి ఈ పోటీ చేసేవారందరు" మనస్సు

"అయితే లక్షలకు లక్షలు కావాలి కదా" అని లోలోపల అనుకుంటు బయటకు అనేసింది. అప్పుడే తిరిగొచ్చిన సరోజిని అది విని "పార్టీ యిస్తుంది కద" అంది నవ్వుతు.

'అవును కదా' మైనా ఆమె మాటలతో మాటలు కలుపుతూ అంది.

సరోజిని మైనాను ముద్దుపెట్టుకుంది. చేతుల్లో చేతులేసి అటుయిటు వూపింది. మైనా నడుం పట్టుకుని దూరంగా వున్న మరో బెంచి మీదకు తీసుకెళ్లి కన్ను గీటింది, నవ్వింది, నవ్వించింది.

ఆరోజు రాత్రి స్టార్ హోటల్ లో ఖరీదైన గది. సోఫాల మధ్య టీపాయి, మబ్బులాంటి ఫోమ్ బెడ్. కౌంటర్‌కు ఫోన్ చేస్తే అన్ని అక్కడికే నడిచి వస్తాయి.

"ఛీర్స్" అన్నాడు మిస్రా విస్కీగ్లాసును పైకెత్తి సరోజవైపు చూస్తు.

"హు కానివ్వండి అంటు తన గ్లాసును ఎత్తింది."

రాజకీయాల్లో ఇవి తప్పవు అన్నది సరోజిని.

"కూల్ డ్రింక్స్" అంటు సరోజిని కోకోకోలాను మూత తీసి గ్లాసులోకి వొంపి మైనాకు

అందించింది ఎంతో ప్రేమను ప్రదర్శిస్తూ.

మరో రౌండ్ గ్లాసును అందుకునేటప్పుడు చెయ్యిమీద చెయ్యివేసి "గరం అయె సరు" అన్నాడు మిస్రా. అప్పుడు ఆయన చూపుల్లో కొంటెతనాన్ని గ్రహించిన నల్లని సరు తెల్లగా నవ్వింది.

తల వంచుకొని కూర్చున్న మైనా వైపు చూస్తు "క్యాసోచ్ రహే" అన్నాడు మిస్రా.

ఏమి లేదన్నట్టు మైనా తల అడ్డంగా వూపింది.

ఈసారి గ్లాసుతోపాటు సరోజిని చేయి పట్టుకొని పక్కనొచ్చి కూర్చోఅన్నట్టు సైగ చేశాడు. ఆమె వెళ్లి కూర్చుంది. అప్పుడు ఆమె కొంగు వళ్లోకి జారింది. ఒకరినొకరు తాకువుంటు వున్నారు.

మైనా వెళ్లి మ్యూజిక్ చానల్ ఆన్‌చేసింది. గదంతా చక్కని పాశ్చాత్యసంగీతంతో మారు మోగుతువుంది.

మిస్రా సరోజిని చెవిలో ఏదో చెప్పాడు.

"మైనా ఆ మిగిలిన కూల్ డ్రింక్ తాగవ్" అంది సరే అన్నట్టు "తాగుతా అన్నట్టు" తలాడించి తాగింది మైనా.

"రుచి మారింది" అంటు ఇద్దరివైపు చూసింది.

చాలాసేపు అయింది కదా అంది సరోజ గోముఖంగ.

"డ్రింక్‌లో అయితే-" అనుమానంగా చూస్తు అడిగింది మైనా.

" ఏమయితది కలిపితే కాబోయే ఎం. ఎల్. ఏ. వి రాజకీయాలను తట్టుకోవాలంటే తాగక తప్పదు సుమా" అంది సరోజ.

మూజిక్ ద్యాసలో హు అని తల వూపింది. అదే ద్యాసలో గ్లాసందుకుంది. గంట గడిచాక మిస్రా సరోజిని ఇద్దరు లేచి మ్యూజిక్‌ను అనుసరించారు. సౌండ్ పెద్దగ చేయమని సైగ గూడ చేశాడు.

మైనాలోను హుషారు పెరిగింది. ముగ్గురు ఒకరు నడుమును మరొకరు పట్టుకొని వెష్టన్ మ్యూజిక్‌కు అనుగుణంగా కదులుతూ వున్నారు. ఉన్నట్టుండి సరోజ చీరెను విప్పేశాడు.

మైనా ఆ స్థితిలో సరోజినిని చూసి నవ్వుతూ, తన వంటినీ తాకి చూసుకుంది. బట్టలున్నాయి. తనలో తానే నవ్వుకుంది. మనిషిని గంతులేపించే మ్యూజిక్, వంట్లో ఉత్సాహాన్నిచ్చే డ్రింక్, పెద్దవారితో స్నేహం. మిస్రా మైనా చేయి పట్టుకుని కదల సాగాడు.

ఆమె అనుకూలంగా కదులుతువుంది. వొకరి నడుం మీద మరొకరి చేయివుంది. కదిలి కదిలి అలిసి- బెడ్ మీద ఒరిగిన మైనా కళ్లు తిరుగుతుంటే మంచం అంచులను అదిమి పట్టుకుంది. ఆ భంగిమను అనుకూలంగ మలచుకుని, ఆతరువాత అక్కడి నుండి వెళ్లి పోయాడు మిస్రా.

చీకటి ముగిసి సూర్యోదయం అయ్యింది.

కళ్లు తెరిచిన మైన దిగ్గున లేచి కూర్చుంది. తన చీర ఊడిపోయివుంది. ఓసారి తడిమి చూసుకుంది.

కొండమీదినుండి కింద పడ్డంత భయంతో వనికి పోయింది. తన ను తాను మరోసారి తడిమి చూసుకొని-

విషయం గ్రహించి "అమ్మా" అని అరిచింది.

అది ఎయిర్ కండీషన్ గది!

వళ్లుతెలియని స్థితిలో సరోజ పక్కమంచంపై పడుకోని వుంది.

సరోజను కొట్టి లేపేంత కోపం వచ్చినా అనుచుకోక తప్పలేదు కుళ్లి కుళ్లి ఏడుస్తువుంది.

* * *

ఢిల్లీ నుండి తిరిగొచ్చారు.

సరోజినికి పార్టీ టికెట్ దొరికింది. కాని ఎన్నికల్లో ఓడిపోయింది.

మైనా మతి తప్పింది. తండాకు వెళ్ల నే వెళ్లదు. ఒక చోటా వుండదు.

"మరి ఆ సంకలో బాబు?" అని అడిగింది అంతా విన్న రాధ.

" ఆమె కొడుకే!" అంది సావిత్రి.

డిసెంబరు 99 ●